ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	583.50 (293.1090)	3,54,718	4,31,678
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.25 (4.00)	1,227	3,891
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	165.948 (32.837)	3,70,063	3,41,504

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

శతశాతం అక్షరాస్యత లక్ష్యం



ఓపెన్ స్కూల్ ప్రవేశాల పోస్టర్ విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు (ఫైల్)

దేశంలో సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా అడుగులు ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు 2047 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించడం ప్రభుత్వ లక్ష్యం. ఈ దిశగా వచ్చే ఐదేళ్ల పాటు అమలు చేయనున్న న్యూ ఇండియా లిటరసీ (ఎన్ఐఎల్‌పీ) 2022-2027లో భాగంగా తొలి దశ కార్యాచరణ ప్రారంభమైంది. సమభావన సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం, పలు కారణాలతో చదువును మధ్యలోనే నిలిపిన మహిళలను ఓపెన్ స్కూల్‌లో చేర్పించి పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేయించాలన్నది లక్ష్యం.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)

- తొలుత సమభావన సంఘాల మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు
- ఎన్ఐఎల్‌పీలో భాగంగా కార్యక్రమాలు
- ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సెప్టెంబరు 5న ఈ కార్యక్రమానికి క్షేత్రస్థాయిలో శ్రీకారం చుట్టనున్నారు. అందుకోసం ఇప్పటికే అర్హులు, వలంటీర్స్, శిక్షణ, పుస్తకాల సరఫరా పూర్తయింది. వయోజన విద్యాశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా పనిచేయనున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏడాదిలో సుమారు 1.29లక్షల మంది మహిళలు అక్షరాస్యులు కానున్నారు.

2047నాటికి సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం

శతశాతం అక్షరాస్యత 2047 నాటికి సాధించడం వికసిత్ భారత్ లక్ష్యం. ఈ మేరకు ఐదేళ్లపాటు అమలు చేయనున్న ప్రణాళికలో మొదటి దశలో సమభావన సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలను అక్షరాసులుగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని ప్రభుత్వం సంకల్పించింది. సమభావన సంఘాల సభ్యులు చైతన్యవంతంగా ఉండటం, కుటుంబంతో పాటు సమాజంలో ప్రభావితం చూపే సామర్థ్యం ఉండటం, బ్యాంకు లింకేజీ రుణాలతో వారి పరిధిలో ఆర్థిక వ్యవహారాలు నడుపుతుండటం తదితర కారణాలతో ఎన్ఐఎల్‌పీ మొదటి దశకు ఎంపిక చేశారు. అంతేగాక పాఠశాల విద్యను మధ్యలోనే నిలిపిన మహిళా సంఘాల సభ్యులను ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేర్పించి పూర్తి చేయించనున్నారు. మహిళా సంఘాల రుణాలు, చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే జరుగుతుండటం, వారి సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వాలు ఇప్పటికే పలు పథకాలు అమలు చేస్తుండగా రానున్న కాలంలో మరిన్ని పథకాలు ప్రవేశపెట్టనున్నారు. దీంతో వారి పనులను వారే చేసుకోవడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించుకొని ఆపాదించుకోవడం, అన్నింటికీ మించి అక్షరాస్యత, విద్యార్హతలతో వారిలో న్యూనత భావం తొలగి ఆత్మవిశ్వాసం పెరిగి మరింత సాధికారత సాధించగలుగుతారని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మొదటి దశకు ఎంపికైన ఉమ్మడి జిల్లాలోని మహిళా సంఘాల్లోని నిరక్షరాస్య మహిళల గుర్తింపు పూర్తి కాగా, ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు అర్హుల గుర్తింపు సాగుతోంది.

ఉల్లాస్ యాప్‌లో నమోదు

ఎన్ఐఎల్‌పీ మొదటి దశకు గుర్తించిన ఉమ్మడి జిల్లాలోని 1.29 లక్షల మంది నిరక్షరాస్య మహిళల వివరాలను ఉల్లాస్-నవభారత్ సాక్షరత కార్యక్రమం యాప్‌లో నమోదు చేశారు. అయితే అక్షరాస్యతపై ఆసక్తి కలిగిన సమభావన సంఘాల సభ్యులు గానీ మహిళలు, పురుష నిరక్షరాసులు కూడా చేరవచ్చు. ఈ మేరకు గ్రామం లేదా బస్తీ యూనిట్‌గా 10మందికి ఒక వాలంటీర్‌ను నియమిస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులు, యువకులు, సామాజిక కార్యకర్తలు, ఇతర ఔత్సాహికులను వాలంటీర్స్‌గా గుర్తించారు. వీరికి ఎలాంటి పారితోషికం, గౌరవ భృతి ఉండదు. స్వచ్ఛందంగా మాత్రమే పాల్గొనాలి. ప్రతీ రోజు గంట పాటు వీరిని ఒకే చోట చేర్చి నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతారు. ఏడాది పాటు సాగే మొదటి దశలో తెలుగు చదవడం, చూసి రాయడం, డిక్టేషన్ రాయడం, సంతకం, కనీస లెక్కలు చేసేలా నేర్పుతారు. అందుకోసం సెంటర్ వారీగా పుస్తకాలు, అవసరమైన విద్యాసామగ్రి అందించనున్నారు. అలాగే పలు కారణాలతో చదువును మానేసిన మహిళలను వారి అర్హతల ఆధారంగా ఓపెన్ స్కూల్స్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేర్పిస్తారు. ప్రతీ మండలంలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ స్కూల్స్ నిర్వహిస్తారు. సంవత్సరానికి 30 తరగతులు సెలవు రోజుల్లో నిర్వహిస్తారు. కనీసం 20 తరగతులకు తప్పనిసరిగా హాజరు కావల్సి...

- మిగతా 8వ పేజీలో...

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం



కొండమడుగు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండలం కొండమడుగు పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీచేశారు. హాజరు పట్టికను పరిశీలించి హాజరైన సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. దవాఖానాలో గత నెలలో జరిగిన ప్రసవాలు ఎన్ని?, అందులో సాధారణ ప్రసవాలు ఎన్ని? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహేశ్వరి అనే బాలింతతో కలెక్టర్ మాట్లాడి తల్లీ, బిడ్డల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పనితీరును పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

జిల్లా వైద్య కళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీ

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న 56 పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయిమెంట్ అసిస్టెంట్ మిషన్ (టీమ్) కార్యదర్శి శాంతిశ్రీ ఖాళీ పోస్టుల వివరాలు, అర్హతలను వెల్లడించారని వివరించారు. నిర్దేశించిన పోస్టులను మెరిట్, రోస్టర్ అర్హతలనుబట్టి భర్తీ చేయనున్నట్లు వివరించారు. 18 నుంచి 44 ఏళ్లవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫాం డౌన్‌లోడ్ చేసుకొని ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 2వ తేదీలోగా జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలోని టీమ్ సెక్షన్‌లో సమర్పించాలన్నారు. గతంలో ప్రజావాణి, టీం ఆఫీస్, ఉపాధి కల్పన కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు కూడా తిరిగి చేసుకోవాలని సూచించారు.

పోస్టుల వివరాలు 8లో..

రాచకొండ ఎత్తిపోతల పథకమే శరణ్యం



రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటుచేయాలని సంస్థాన్‌నారాయణపురంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

7

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

ఎస్‌వోటీ అదనపు డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌వోటీ అదనపు డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌వోటీ అదనపు డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురష్కరించుకొని శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో చౌటుప్పల్ పట్టణంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖ సూచించే నిబంధనలను గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా పాటించాలన్నారు. చౌటుప్పల్ ఏసీపీ వి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, రాకపోకలకు అంతరాయం లేకుండా గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీజే సౌండ్ వాడకూడదని, సాధారణ మైక్‌లు రాత్రి 10గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. సమావేశంలో చౌటుప్పల్ ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సీఐ మన్మథ కుమార్, మునిసిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌లు, బీజేపీ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన, సీతారామచంద్రస్వామి ఆలయం చైర్మన్ మురళీ, ఏఎంసీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్, షాదీఖాన చైర్మన్ కరీమ్, బాబా షరీఫ్, ఆలె చిరంజీవి, సైదులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట డివిజన్ పరిధిలో గణేష్ మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ గణేష్‌నాయక్, ఎంపీడీవో నవీన్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ మిర్యాల లింగస్వామి, సీఐ భాస్కర్, ట్రాఫిక్ సీఐ ఎలగొండ కృష్ణ, మెడికల్ ఆఫీసర్ పావని, ఎస్ఐలు యాదయ్య, సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం పాలసీని సవరించాలి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాములు



సమావేశంలో మాట్లాడుతున్న బొలగాని జయరాములు

రామన్నపేట,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):మద్యం పాలసీని సవరించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు అన్నారు. శుక్రవారం రామన్నపేటలో జరిగిన కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు గీత కార్మికులకు వైన్స్ షాపుల్లో 25శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి, ప్రస్తుతం 15 శాతం మాత్రమే ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాగిర్ కృష్ణయ్య మాట్లాడుతూ జిల్లాలో గీత కార్మికులందరికీ తక్షణమే కాటమయ్య రక్షణ కరచాలను అందించాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఎర్ర రవీందర్, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గాజుల అంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు బావండ్లపల్లి బాలరాజు, జిల్లా నాయకులు మల్లేషం, మండల కోశాధికారి మునుకుంట్ల లెనిన్, అంజయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హామీతో సమస్య పరిష్కారానికి చర్యలు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హామీతో పట్టణంలోని మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. పట్టణంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని స్థానికులు కలిసి మురుగు కాల్వ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని గాంధీ పార్క్ నుంచి వెళ్లే మురుగు కాల్వను మునిసిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఆయన వెంట ఏఈ సతీష్‌రెడ్డి, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్ తదితరులు ఉన్నారు.

• బంద్ ప్రశాంతం



మార్వాడీలకు వ్యతిరేకంగా మోత్కూరులో బంద్ నిర్వహిస్తున్న స్థానిక వ్యాపారులు

8

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్

భువనగిరి రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి జినుకుల శ్యాంసుందర్ అన్నారు. పనుల జాతరలో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనుకుంట్ల రేఖ బాబురావు, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, ఎంపీవో దినకర్, ఏపీవో బాలస్వామి, కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.



తుక్కాపురంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న శ్యాంసుందర్

భీమలింగం కాల్వపై ప్రహరీ నిర్మించాలి



భీమలింగం కల్వను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): భీమలింగ కాల్వపై నూతన బ్రిడ్జికి ప్రహరీ నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ చేపట్టిన పోరుబాటలో భాగంగా భీమలింగం కాల్వను పరిశీలించి మాట్లాడారు. రూ.5కోట్లు నిధులు కేటాయించి కేవలం ఒకవైపు మాత్రమే కొంత దూరం నిర్మించి, అసంపూర్తిగా వదిలివేశారని అన్నారు. వెంటనే నిర్మాణం చేపట్టాలన్నారు. కాల్వలో పేరుకుపోయిన గుర్రెపుడెక్కను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, కూర శ్రీనివాస్, నర్సింహ, శ్రీశైలం రెడ్డి, సత్తయ్య, లక్ష్మయ్య, ఇందిర పాల్గొన్నారు.

వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు




భువనగిరి కంపోస్ట్ యార్డ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కంపోస్టు యార్డులో వ్యర్థ పదార్థాల నిర్వహణ శాస్త్రీయంగా ఉండాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం భువనగిరి మునిసిపల్ కంపోస్టు యార్డ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఇళ్లు, వీధుల నుంచి సేకరిస్తున్న చెత్త, తరలింపు, నిర్వహణ, కంపోస్ట్ యార్డ్ పనితీరును సమీక్షించారు. వర్మీ ఎరువు తయారీ, డ్రై రిసోర్స్ సెంటర్, బయో మైనింగ్ యూనిట్, ఎఫ్ఎస్‌టీపీని పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట కమిషనర్ జి.రామలింగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాఫర్ అలీ, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదు

• ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



తుర్కపల్లిలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

తుర్కపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్కరికి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందజేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని, సీఎం రేవంత్‌రెడ్డి ఓ వైపు కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ మరోవైపు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలేరు మార్కెట్ చైర్మన్ అయినాల చైతన్యరెడ్డి, మండల ప్రత్యేకాధికారి జానయ్య, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధనావతు శంకర్‌నాయక్, నాయకులు పలుగల శ్రీనివాస్, చాడ భాస్కర్‌రెడ్డి, మోహన్‌బాబు, అయిలయ్య, భూక్య రాజారాంనాయక్ పాల్గొన్నారు.

పేదింటి కల నెరవేరింది

రాజాపేట: కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సొంతింటి కల నెరవేరిందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. రాజాపేట మండలం సోమారం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి హాజరయ్యారు. పల్లపు సుశీల కుటుంబ సభ్యులకు వస్త్రాలు, గొర్రె పొట్టేల్‌ను అందజేశారు. అనంతరం ఇంటి ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శాంతి నిర్మల, ఎంపీడీవో నాగవేణి, తహసీల్దార్ అనిత, నాయకులు మహేందర్‌గౌడ్, పెంటయ్య, బాల్‌రాజ్, భిక్షపతి, జగన్‌మోహన్‌రెడ్డి, సుభాష్ రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

బొమ్మలరామారం: పనుల జాతర కార్యక్రమం ద్వారా అభివృద్ధి పరుగులు తీసే విధంగా పనిచేయాలని బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని మర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సృజన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో లబ్ధిదారులకు పనిదినాలు తగ్గినప్పటికీ రోజువారి కూలి రూ. 310 నుంచయి రూ.320 వరకు పెరిగిందన్నారు. అంతకుముందు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రేషన్‌కార్డుల పంపిణీలో, మల్యాలలో మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగిరెడ్డి, డీపీవో సునంద, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రాజా త్రివిక్రమ్ పాల్గొన్నారు.

మిత్రుడి ప్రయత్నానికి సహాయంగా..

● 30 ఏళ్ల అనంతరం దేశానికి.. ● పశుగణాల సేవలో వైద్యుడు పెంటయ్య
● రూ.20 వేలు విరాళంగా అందజేసిన మిత్రుడు సుధాకర్

(ఆంధ్రజ్యోతి-కోదాడ రూరల్)
దేశంలో ఎక్కడాలేని విధంగా పశు ఔషధ బ్యాంక్ ఏర్పాటుచేసిన మిత్రుడిగా అండగా నిలిచారు సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఎన్‌ఆర్‌ఐ చప్పిడి సుధాకర్. ఇందుకోసం 30 ఏళ్ల తర్వాత స్నేహితుడిని కలిశారు. వివరాలు ఇలా ఉన్నాయి.


మిత్రుడు అందజేసిన విరాళాన్ని తీసుకుంటున్న పెంటయ్య(తెల్లచొక్కా వ్యక్తి)

30 ఏళ్ల కిందట హైదరాబాద్‌లోని పశువైద్యకళాశాలలో చప్పిడి సుధాకర్, పీ పెంటయ్యలు సహచర విద్యార్థులు. సుధాకర్ చదువు పూర్తయ్యాక అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. పెంటయ్య ఉద్యోగంలో చేరి ప్రస్తుతం కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. కోదాడలో విధుల్లో చేరి నాటి నుంచి పశుఆరోగ్య సేవలతో పాటు పశుపోషకుల సంక్షేమం కోసం వినూత్నంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పశుపోషణ భారం కాకుండా రైతులు లాభాల బాటలో నడవడానికి వైద్య, మేపు ఖర్చులు తగ్గించడానికి దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారి దాతల సహకారంతో పశుఔషధ బ్యాంక్ ఏర్పాటు చేశారు. ఇందులో కొన్ని ఉచితంగా, మరికొన్ని సబ్సిడీపై ఔషధాలు అందిస్తున్నారు. ఈ విషయం తెలిసిన స్నేహితుడు సుధాకర్ మూగజీవాల సేవలో తాను సైతం చేయి కలుపుతానంటూ ముందుకు వచ్చారు. తండ్రి గాబ్రియేల్ పేరు మీద రూ.20000 విరాళంగా ఇచ్చేందుకు 30 ఏళ్ల తర్వాత అమెరికా నుంచి వచ్చారు. స్నేహితుడు పెంటయ్యను కలిసి విరాళాన్ని అందజేశారు. చాన్నాళ్లకు స్నేహితుడిని చూసిన పెంటయ్య ఆశ్చర్యానికి గురయ్యారు. తన ప్రయత్నాలకు అందించిన విరాళాన్ని సద్వినియోగం చేస్తానన్నారు. ఈ సందర్భంలో తమ కలయికకు గుర్తుగా పశువైద్యశాల ఆవరణలో పండ్లలో శ్రేష్ఠమైన హిమాయత్ పసంద్ మామిడి మొక్కను నాటారు. అలాగే వీరిద్దరి క్లాస్‌మెట్ సూర్యాపేట పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బీ వెంకన్న కూడా మిత్రులతో కలిసి ఆనందం పంచుకున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు సాగర్ విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బీసీ గురుకుల విద్యాలయ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. అండర్-18 విభాగంలో పరుగుపందెంలో నంద కిషోర్ స్వర్ణం, జావెలిన్ త్రోలో దినేష్ స్వర్ణం, లాంగ్ జంప్‌లో రజతం, అండర్-16 విభాగంలో పరుగుపందెలో గణేష్ స్వర్ణం, లాంగ్ జంప్‌లో స్వర్ణం, అరవింద్, హరి, రవి తేజలు ప్రతిభ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

దర్వేశిపురంలో కుంకుమ పూజలు


అమ్మవారికి నిర్వహించిన కుంకుమపూజకు హాజరైన భక్తులు

కనగల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద ఉన్న రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని శ్రావణమాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. సామూహిక కుంకుమపూజలో పాల్గొన్నారు. ఇష్టదైవానికి చీరసారె, ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం శివుడి విగ్రహం వద్ద దీపారాధన చేశారు. ముడుపులు కట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

నల్లగొండ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):నిర్మాణరంగంలోని కార్మికులకు బకాయిలను వెల్ఫేర్ బోర్డు వెంటనే చెల్లించాలని, బోర్డు దుబారా ఖర్చులను ఆపాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నల్లగొండ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు కంచి కేశవులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ప్రమాద, సహజ మరణం, పెళ్లికానుక, ప్రసూతి కానుక తదితర లబ్ధికోసం దరఖాస్తు చేసుకొని నెలల తరబడి లేబర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. అయినా పరిష్కరించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నల్లగొండ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, అద్దంకి నరసింహ, సైదాచారి పాల్గొన్నారు.

తల్లిని పూజిస్తే జీవితం సుఖమయం:బిషప్ ధమన్



నల్లగొండ కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : మరియరాణిని భక్తితో పూజిస్తే జీవితం సుఖమయంగా ఉంటుందని బిషప్ కరుణం ధమన్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రం దేవరకొండరోడ్డులోని మరియరాణి కేథ్రిడల్ చర్చిలో శుక్రవారం చర్చి మహోత్సవంలో భాగంగా పూజాబలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధమన్ మాట్లాడుతూ మరియరాణి తల్లిని పూజించే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందన్నారు. తల్లిని భక్తితో పూజిస్తే మంచి జరుగుతుందనే నమ్మకం భక్తుల్లో ఉందన్నారు. సాయంత్రం మరియరాణి విగ్రహాన్ని అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో విశ్రాంతి బిషప్ గోవింద్ జోజి, విచార ఫాదర్ జీ బాలస్వామి, అర్నారెడ్డి, రాయప్ప, బాలశౌరిరెడ్డి, శౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిల భారం మోయలేం

పేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం పొందేందుకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చింది. గతంలో రూ.5 లక్షల వరకు ఉన్నవైద్య సేవలను ప్రభుత్వం ఇటీవల రూ.10 లక్షలకు పెంచింది. బీఆర్‌ఎస్ హయాంలో ఏడాది బకాయిల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బకాయిల్లో కేవలం 10 శాతం మాత్రమే విడుదల చేసింది. ఒక్కో ఆసుపత్రికి ప్రభుత్వం రూ.కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉంది. బకాయిలు ప్రైవేట్ ఆసుపత్రులకు భారంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాలానుగుణంగా ధరలను పునఃసమీక్షించడంతో పాటు బకాయిలు చెల్లించాలని యజమాన్యాలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 31లోగా నిధుల విడుదల, ధరల పునఃసమీక్ష చేయని పక్షంలో 31వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయనున్నట్లు ప్రకటిస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను ఆలస్యంగా విడుదల చేస్తోంది. దీంతో కొన్ని ఆసుపత్రుల్లో రోగులను సదుపాయలు లేవన్న సాకుతో తిప్పిపంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఆసుపత్రి నిర్వాహకులకు ఔషధాలు, వైద్యులు, నర్సుల జీతాలు, ఆసుపత్రి నిర్వహణ భారంగా పరిణమిస్తోందని అంటున్నారు. ధరల పెరుగుదలను అనుసరించి వైద్య చికిత్స ధరలను పెంచాల్సివుండగా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉద్యోగుల, జర్నలిస్టుల ఆరోగ్య పథకం కింద 2 ఏళ్లకుపైగా బకాయిలు విడుదల చేయలేదని విమర్శిస్తున్నారు.

నూతనంగా మరో 163 వ్యాధులకు చికిత్సలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2007లో సీఎం రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి, తెల్లరేషన్‌కార్డు కలిగిన పేదలకు కొన్ని దీర్ఘకాలిక, ఖరీదైన వైద్యం పొందేందుకు వెసులుబాటు కల్పించారు. ఆయా ఖర్చులను ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వమే ఆసుపత్రులకు విడుదల చేస్తోంది. బీఆర్‌ఎస్ హయాంలో 1,672 వ్యాధులకు చికిత్స అందించగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో అదనంగా 163 వ్యాధులను కలిపి మొత్తంగా 1,835 రకాలకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ కలిగిన ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సను పొందే విధంగా అవకాశం పెంపొందించారు. డయాలసిస్ మొదలుకొని గుండెజబ్బుల వరకు ఆరోగ్యశ్రీ సేవలను విస్తరించారు. గతంలో రేషన్‌కార్డు కలిగిన కుటుంబ సభ్యులందరికీ రూ.5 లక్షల్లోపు వైద్యం పొందే అవకాశం ఉండగా, ఆ మొత్తాన్ని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచారు.

» ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతకు ఆసుపత్రులు సన్నద్ధం
» వారంలో నిధుల విడుదలకు, ధరల పునఃసమీక్షకు డిమాండ్

రెండేళ్లుగా పెండింగ్‌లోనే బిల్లులు

ఉద్యోగుల, జర్నలిస్టుల ఆరోగ్య పథకింద బిల్లులు 2023 నుంచి పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. వైద్యం చేస్తే వచ్చే డబ్బుల కన్నా రోగి చికిత్సకు మందులు, శస్త్ర చికిత్స ఖర్చులకు డబ్బులు లేక కొన్ని ఆసుపత్రులు సౌకర్యాల లేమి పేరుతో రోగులను మరో చోటుకు పంపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.కోట్ల బకాయిలతో ఆసుపత్రులు నిర్వహించడం కష్టంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం బకాయిలు విడుదల చేయని పక్షంలో ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలు నిలిపివేస్తామని ఆసుపత్రి వర్గాలు ప్రభుత్వ ఆరోగ్యశ్రీ సీఈవోకు నోటీసులు ఇచ్చాయి.

నిధులు విడుదల చేయకుంటే సేవలు బంద్



రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మరో ఎనిమిది రోజుల్లో ప్రభుత్వం బకాయిలు చెల్లించనిపక్షంలో ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తాం. బకాయిలు క్రమం తప్పకుండా విడుదల చేస్తామని ప్రభుత్వం హామీఇచ్చి పాటించడం లేదు. వైద్య చికిత్స ధరలను పునఃపరిశీలించాలి. ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ బిల్లులు రెండు ఏళ్లగా పెండింగ్‌లో ఉన్నాయి. బకాయిలు విడుదల కాకుంటే ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మరుతోంది. ప్రభుత్వం సత్వరమే బకాయిలు విడుదలకు చర్యలు చేపట్టాలి.

- డా. మువ్వా రామారావు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు

ఉమ్మడి జిల్లాలో రూ.100 కోట్ల వరకు బకాయీలు?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 56 ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు పొందుతున్నారు. ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్), జర్నలిస్టుల ఆరోగ్య పథకం(జేహెచ్‌ఎస్) కింద వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల, జర్నలిస్టులకు వైద్యసేవలకు ప్రభుత్వం కొంతకాలంగా నిధులు విడుదల చేయకపోవడంతో ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మారిందంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ బకాయిలు సుమారు రూ.100 కోట్ల వరకు ఉన్నట్లు వైద్యరంగ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. గత జనవరిలో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించి 10 శాతం నిధులు మాత్రమే విడుదల చేసినట్లు ఆసుపత్రి వర్గాలు అంటున్నాయి. చర్చల సందర్భంలో ప్రభుత్వం క్రమం తప్పకుండా బకాయిలు చెల్లింపు, ధరల పునరుద్ధరణ చేస్తామని మాట ఇచ్చి పాటించడం లేదని ఆరోపిస్తున్నారు.

ప్రతి వర్షపు నీటిబొట్టునూ ఒడిసిపట్టాలి



కొంపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రావు

మునుగోడు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో కురిసిన ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టాలని, అప్పుడే భూగర్భజలాలు పెరిగి నీటికష్టాలు తీరుతాయని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామంలో ప్రజాజాతర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని వీధులు, మురుగుకాల్వలను, హరితహారం చెట్లను, వీధుల్లో పరిశుభ్రతను పరిశీలించి గ్రామ కార్యదర్శి స్వామిని అభినందించారు. వెదిరే పూలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉపాధి పథకంతో ఎక్కువ నిధులు సాధించి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలన్నారు. ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలన్నారు. మహిళల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి, వారిని కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధి పథకంలో 100 రోజులు పనికి వెళ్లిన జీడిమడ్ల లింగయ్య, గోలి బిక్షంను గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ జీడిమడ్ల దశరథను సన్మానించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఇంకుడుగుంతకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వెదిరె ఫౌండేషన్ సభ్యులు వెదిరె విజేందర్‌రెడ్డి, డీపీవో వెంకయ్య, ఏపీడీ నవీన్‌కుమార్, ఎంపీడీవో యుగేందర్, ఎంపీవో పర్వేజ్, ఏపీవో నాగరాజు, కార్యదర్శి స్వామి, మాజీ సర్పంచ్ జాల వెంకన్న యాదవ్, ఈసీ జీడిమడ్ల మల్లేష్ ఉన్నారు.

చివ్వెంలలో పట్టపగలే హత్యాయత్నం

● కారులో వెంబడించిన నలుగురు
● పరుగెత్తి ప్రాణాలు కాపాడుకున్న బాధితులు

చివ్వెంల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దాడిచేసిన వ్యక్తిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళుతున్న వారిపై పట్టపగలే హత్యాయత్నం జరిగింది. ద్విచక్ర వాహనంపై ఇద్దరు భార్యలతో వెళుతుండగా కారులో వెంబడిస్తుండటాన్ని గమనించిన బాధితుడు సమీపంలోని వైన్స్ దుకాణంలోకి వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నాడు. శుక్రవారం సూర్యాపేట జిల్లా చివ్వెంలలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన దండుగుల లక్ష్మయ్యకు ఇద్దరు భార్యలు కాగా, రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నారు. ఓ వివాదంపై కుడకుడకు చెందిన దండుగుల శేఖర్‌పై లక్ష్మయ్య చివ్వెంల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడి పరిష్కరించుకున్నారు. లక్ష్మయ్య సోదరుడు కొట్టిన రాళ్లను పల్లపు గోపి, అతని కుటుంబ సభ్యులు తీసుకెళ్లిన ఘటనలో గోపి డబ్బులు చెల్లించాలని పెద్ద మనుషులు తీర్మానించారు. ఇందుకు సంబంధించిన నగదు కోసం శుక్రవారం చివ్వెంల వెళ్లిన లక్ష్మయ్యకు గోపి, శేఖర్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. లక్ష్మయ్యపై దాడి చేసి కొట్టటంతో గ్రామస్థులు అక్కడినుంచి పంపించారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసేందుకు లక్ష్మయ్య తన ఇద్దరు భార్యలు వెంకటమ్మ, పద్మలతో కలిసి పోలీసుస్టేషన్‌కు వెళ్తున్న క్రమంలో పల్లపు గోపి, దండుగుల శేఖర్, పల్లపు రాఘవ, పసుపుల చంటి కారులో వెంబడించారు. బీబీగూడెం శివారులోని ఇండియన్ ఆయిల్ బంక్ దగ్గరికి రాగానే ద్విచక్ర వాహనాన్ని సమీపంలో ఉన్న మధురా వైన్స్ వద్ద నిలిపి లోపలికి పరుగెత్తారు. లక్ష్మయ్యపై దాడిచేసేందుకు కత్తితో వెంబడిస్తుండగా వైన్స్ దుకాణంలోనుంచి ఎక్కువమంది రావటంతో కర్రలు, కత్తులు సంఘటనా స్థలంలో విడిచి కారులో అక్కడినుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గోపి, శేఖర్, రాఘవ, చంటిలపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.


తమపై దాడి చేసేందుకు కారులోంచి దిగుతున్న వ్యక్తిని చూసి పరుగెడుతున్న లక్ష్మయ్య, ఆయన భార్యలు

ప్రాణాలు తీసిన మతిమరుపు


రాములు(ఫైల్)
ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

చింతపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మతిమరుపు ఓ వృద్ధుడి ప్రాణంతీసింది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తిరుమలాపురంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ రాంమూర్తి, తిరుమలాపురం స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిరుమలాపురం గ్రామానికి చెందిన గార్లపాటి రాములు(80) కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయన భార్య పదేళ్ల కిందట మృతి చెందగా కుమార్తె ఉన్నారు. కుమార్తె భారతమ్మకు వివాహంకాగా మండలంలోని కుర్మేడు గ్రామంలో ఉంటున్నారు. కొంతకాలంగా రాములు కుర్మేడులోని కుమార్తె ఇంట్లోనే ఉంటున్నాడు. కొంతకాలంగా రాములు మతిమరుపు సమస్యతో బాధపడుతున్నాడు. స్వగ్రామం తిరుమలాపురంలో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్న విషయం తెలుసుకుని బుధవారం గ్రామానికి వచ్చారు. గురువారం రాత్రి గ్యాస్ స్టవ్‌పై వంట చేసుకుని భోజనం చేసి నిద్రించాడు. గ్యాస్ ఆఫ్ చేయకుండా నిద్రకు ఉపక్రమించాడు. కొంత సమయం తర్వాత రాములు లేచి చుట్ట తాగుతుండగా గ్యాస్ సిలిండర్ పేలి పైకప్పు ధ్వంసమై స్లాబ్ కింద ఉన్న రాములుపై పడింది. భారీ శబ్దం రావడంతో మనుమడి స్నేహితుడు కుర్మేటి నవీన్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌తో స్లాబ్ కప్పును తొలగించగా రాములు శరీరం పూర్తిగా కాలిపోయి మృతి చెంది కనిపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాములు మనుమడు గార్లపాటి ప్రవీణ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొండమల్లేపల్లిలో దొంగ రిమాండ్

కొండమల్లేపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పోలీసులు దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొర్రోనితండా గ్రామపంచాయతీలో ఈ నెల 11న రాత్రి కొర్ర పట్టి ఇంట్లో దొంగతనం జరిగింది. దేవరకొండ ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ అజ్మీరా రమేష్ నేతృత్వంలో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం నిందితుడు కేతావత్ బద్య తన ఇంట్లో ఉండగా పట్టుకొని విచారించారు. రూ.1.50 లక్షల విలువైన కిలో వెండి చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నేరస్తుడి దగ్గర నుంచి సొమ్మును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ శరత్‌పవార్ అభినందించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భువనగిరి రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట పరిధిలోని యాదగిరిపల్లికి చెందిన పుట్ట శివాజీ, సోదరుడు పుట్ట బాలాజీలు రంగారెడ్డి జిల్లా ఘట్కేసర్ మండలంలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కళాశాల నుంచి తిరిగి ద్విచక్రవాహనంపై ఇద్దరు యాదగిరిగుట్టకు వస్తున్నారు. భువనగిరి శివారులోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ద్విచక్రవాహనం నడుపుతున్న శివాజీ తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలాజీకి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

భక్తుడూ భగవంతుడైన ఆలయం

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

భగవంతుడితో సమానంగా భక్తుడు సేవలందుకుంటున్న క్షేత్రం నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గుట్టల్లోని తులసీసాద్ మహరాజ్ ఆలయం. నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి సమీపంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న గుట్టల్లో 200 ఏళ్ల కిందట బాలాజీ వేంకటేశ్వరస్వామి వెలిసినట్లు స్థానికుల నమ్మకం. అయితే స్థానికుడైన తులసీసాద్ అనే భక్తుడు పరమనిష్ఠతో స్వామిని ఉపవాస దీక్షలతో పూజలు చేశాడు. దీంతో అతడికి స్వామి దర్శనమిచ్చినట్లు పూర్వీకులు కథనం. అప్పటి నుంచి తులసీసాద్‌ను కూడా గిరిజనులు దైవంగా కొలవడం ప్రారంభించారు. బాలాజీ తులసీసాద్ పేరుతో రూ.కోటితో దేవాలయాన్ని నిర్మించి గిరిజనులు ఆరాధ్యదైవంగా కొలుస్తున్నారు.

ఏడు తరాల నుంచి వాకునావత్ పాడ వంశానికి చెందిన వారు పూజారులుగా కొనసాగుతున్నారు. చుట్టూ నలమల కొండలు, అడవులు, మూడు వైపులా కృష్ణా జలాలు మధ్యలో గుట్టపై వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించి స్వామి వారితో పాటు తులసీసాద్‌కు పూజలు చేస్తున్నారు. స్థానికులతో పాటు పరిసర తండాల భక్తులతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల, ప్రకాశం, వివిధ జిల్లాల నుంచి భక్తులు దేవాలయానికి వచ్చి వేంకటేశ్వరస్వామితో పాటు తులసీసాద్‌మహరాజ్‌కు పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుంటారు.



కొండలు, గుట్టలలో నిర్మించిన బాలాజీతులసీసాద్‌మహరాజ్ దేవాలయం, ఆలయంలో కొలువుదీరిన తులసీసాద్

ప్రతీ శనివారం భక్తులు పెద్దసంఖ్యలో దేవాలయాన్ని సందర్శిస్తుంటారు. కోరిన కోరికలు నెరవేర్చే దైవంగా బాలాజీ, తులసీసాద్‌మహరాజ్ దేవాలయానికి పేరొందింది. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి పొందిన వైజాగ్‌కాలనీకి వచ్చే పర్యాటకులు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఈ ఆలయాన్ని సందర్శించి వెళ్తుంటారు. ప్రతీ ఏడాది శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు పూజారి వాకునావత్ బిక్కునాయక్ తెలిపారు.

ఆలయానికి ఇలా వెళ్లొచ్చు...

కాచరాజుపల్లిలోని బాలాజీతులసీసాద్ దేవాలయానికి ఇలా వెళ్లాల్సి ఉంటుంది. దేవరకొండ నుంచి పోలేపల్లి మీదుగా పెద్దమునిగల్, వైజాగ్‌కాలనీ, దుబ్బతండాకు రోడ్డు ఉంది. దేవరకొండ నుంచి తులసీసాద్ దేవాలయం 45 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఆటోలు, ప్రైవేట్ వాహనాల ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు.

దేవాదాయ శాఖ సహకరించాలి



వకునావత్ వంశానికి చెందిన వారం బాలాజీతులసీసాద్‌మహరాజ్ దేవాలయంలో పూజలు చేస్తున్నాం. భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుతుండటంతో భక్తుల రద్దీ పెరిగింది. దేవాదాయ శాఖ దేవాలయ అభివృద్ధికి సహకరించాలి. దేవాలయం చుట్టు కొండలు, గుట్టలు, నదీ జలాలు ఉండడంతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి.

వాకునావత్ బిక్కునాయక్, ఆలయ పూజారి

తాళం వేసిన ఇళ్లలో చోరీలు

ఆలేరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతాపురిలో గ్రామంలో జరిగింది. సీఐ యాలాద్రి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సొప్పోజు కృష్ణ, పల్లె బాల్‌నర్సయ్యలు తమ ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కృష్ణ ఇంట్లో రూ.70 వేల నగదును చోరీ చేశారు. శుక్రవారం ఉదయం గమనించారు. క్లూస్ టీమ్ సిబ్బంది రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన వేలిముద్రలను సేకరించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష, పలువురికి కోర్టు జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన సూర్యాపేటలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఐదుగురు వ్యక్తులు మోతాదుకు మించి మద్యం తాగినట్లు గుర్తించామన్నారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా, మిగిలిన నలుగురికి కలిపి రూ.3000 జరిమానా విధించినట్లు తెలిపారు.

అక్రమాలపై విచారణ

తిప్పర్తి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ నిధులను వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించిన మండల స్థాయి అధికారితో పాటు ప్రధానోపాధ్యాయుడిపై విచారణ చేస్తున్నట్లు సమాచారం. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలతో పాటు ఇండ్లూరు ప్రభుత్వ పాఠశాలను పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేశారు. ఈ క్రమంలో తిప్పర్తి హైస్కూల్‌కు రూ.8,78,490 నిధులు రాగా కాగా ల్యాబ్, గ్రంథాలయం కోసం మరో రూ.14.33 లక్షలు మంజూరయ్యాయి. ఇండ్లూరు ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.6.04 లక్షలతో పాటు అదనపు గదులకు మరో రూ 9.45లక్షలు మంజూరు చేశారు. కాగా ఈ నిధులను వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించుకున్నారన్న ఆరోపణలపై విచారణ జరుగుతున్నట్లు సమాచారం.

వరుస వర్షాలతో పత్తికి జీవం

● కాతకు వచ్చిన పత్తి చేలు..
● దరి చేరని తెగుళ్లు.. రైతులలో ఆనందం



వర్షం అనుకూలించడంతో పూత, కాత దశకు వచ్చిన పత్తి చేను

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో పత్తి చేలు కాతకు వచ్చాయి. గత పక్షం రోజులుగా కురిసిన ఒక మోస్తరు వర్షాలకు పత్తి పంటకు జీవం పోయడంతో పాటు ఏపుగా వచ్చాయి. వర్షంతో పత్తి పంటకు ఎలాంటి నష్టం జరక్క పోవడం, తెగుళ్ల కూడా దరి చేరక పోవడం వంటి పరిణామాలతో రైతులలో ఆనందం వ్యక్తమవుతోంది. పత్తి చేలలో అక్కడక్కడ నిలిచిన వర్షపు నీటిని తొలగించి ముందు జాగ్రత్తగా అవసరమైన మందులను వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు పిచికారి చేస్తున్నారు. చౌటుప్పల్ ఏవో ముత్యాల నాగరాజు పర్యవేక్షణలో క్లస్టర్లలోని ఏఈవోలు గ్రామాలు తిరుగుతూ పత్తి చేలకు సంబంధించిన సూచనలు, సలహాలను రైతులకు అందిస్తున్నారు. మునిసిపాలిటీతో పాటు రూరల్ మండలంలో 10,500ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. మే, జూన్ మాసాల్లో పత్తి విత్తనాలను విత్తిన చేలకు కాయలు బలంగా వచ్చాయని రైతులు తెలిపారు. అన్ని రకాలుగా అనువైన నల్లరేగడి భూముల్లో ఒక్కో పత్తి మొక్కకు 100కు పైగా కాయలు వచ్చే అవకాశం ఉంటుందని రైతుల అంచనా. వచ్చే నెల చివరి నాటికి పత్తి పంట చేతికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఒక మోస్తారుగా కురిసిన వర్షాలకు పత్తి పంటకు ఎలాంటి తెగుళ్ల సోకలేదని. దీంతో అదనపు భారం కూడ తగ్గిపోయిందని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.8100 ఉండడంతో పత్తి చేల సంరక్షణ పట్ల రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈసారి పత్తి పంట దిగుబడి అధికంగా వచ్చి ఆదాయం పెరిగే అవకాశాలు ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలలు ముఖం చాటేసిన వరుణుడు

జూన్, జూలై మాసాల్లో వరుణుడు ముఖం చాటేయడంతో ఎండలు దంచికొట్టాయి. ఈ ఎండలకు పత్తి చేలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పాదుల్లోనే మాడిపోయిన విత్తనాల స్థానంలో మళ్లీ విత్తనాలను పెట్టవలసి వచ్చింది. దీంతో రైతులకు అదనపు భారం పడింది. అక్కడక్కడ పత్తి మొలకలు సైతం ఎండి పోయాయి. పత్తి చేలు ఎండి పోయే దశలో కురిసిన వర్షాలతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టు మాసంలో కురిసిన వర్షాలు పత్తి చేలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

చౌటుప్పల్ మండలంలో సాగు ఇలా..

మండలంలో ప్రధానంగా ఆరెగూడెం, కాట్రేవు, పంతంగి, ఎస్.లింగోటం, నేలపట్ల, జైకేసారం, కుంట్లగూడెం, చిన్నకొండూరు, పెద్దకొండూరు, శేరిల్లా, మశీద్ గూడెం, నక్కలగూడెం, తమ్మలోనిబావి, తంగడపల్లి, లింగోజిగూడ, లక్కారం, చౌటుప్పల్, లింగారెడ్డిగూడెం తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. గత సంవత్సరం 11,500 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈ సారి 10,500 ఎకరాలలో పత్తి సాగు చేశారు. గత సంవత్సరం కంటే ఈ సారి 1000 ఎకరాలలో తక్కువగా పత్తి సాగు చేశారు.

పత్తి చేలకు ఉపయోగపడిన వర్షం



పక్షం రోజులుగా కురిసిన వర్షం పత్తి చేలకు ఎంతగానో ఉపయోగపడింది. ఎర్రటి ఎండలకు పత్తి చేలు ఎండి పోయే దశలో కురిసిన వర్షాలు జీవం పోశాయి. వర్షాలు కురియకుంటే తీవ్ర నష్టం వాటిల్లేది. ఇప్పటి వరకు ఎలాంటి తెగుళ్ల కూడ సోకలేదు. రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాం. మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం.

-డిల్లీ చంద్రకళ, మహిళా రైతు, డైరెక్టర్, ఏఎంసీ, చౌటుప్పల్

పత్తి చెట్టుకు50నుంచి 75 కాయలు వస్తాయి



నల్ల రేగడి భూముల్లో ఒక్కో పత్తి చెట్టు కు 50 నుంచి 75 కాయల వరకు వస్తాయి. ఎర్ర భూమి, దుబ్బ భూముల్లో 25 నుంచి 50 కాయలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అదునులో వర్షాలు కురియడంతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకున్న పక్షంలో పత్తి చేలు బలంగా పెరగడంతో పాటు కాయల సంఖ్య కూడ గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. పత్తి దిగుబడి దసరా పండుగ వరకు వస్తుంది. అరుదుగా కురిసిన వర్షాలకు ఈ సారి తెగుళ్ల సోకలేదు. ఈ నెలలో కురిసిన కురిసిన పత్తి చేలకు ఎంతగానో మేలు చేశాయి. రైతులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలను అందిస్తున్నాం.

-మస్కు శంకరయ్య, ఏఈవో, జైకేసారం క్లస్టర్, చౌటుప్పల్

పొడి ఎండతో తెగుళ్ల నుంచి రక్షణ

వర్షాలు నిలిచి పోయి పొడి ఎండ వస్తుండడంతో పత్తి చేలకు తెగుళ్ల నుంచి కొద్దిగా రక్షణ ఏర్పడిందని చెప్పవచ్చు. సస్యరక్షణ చర్యలలో బాగంగా అవసరమైన మందులను పిచికారి చేసేందుకు పొడి ఎండ ఉపయోగపడుతుంది. కొంత మంది రైతులు డ్రోన్ల సాయంతో మందులను పిచికారీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నాబార్డు సహకారంతో సొసైటీలు మరింత బలోపేతం

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాబార్డు సహకారంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 108 సొసైటీలను మరింత బలోపేతం చేస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్ శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. డీసీసీబీతో పాటు సొసైటీల అభివృద్ధిలో నాబార్డు పాత్ర ఎంతో ఉందని, భవిష్యత్తులో ఇదేవిధంగా సహకరించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో మరో ఆరు కొత్త బ్రాంచీల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ప్రాథమిక సహకార సంఘాలకు సంబంధించి కొత్త నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరుతూ సీజీఎంకు వినతిపత్రం అందించారు. అనంతరం సీజీఎం ఉదయభాస్కర్ మాట్లాడుతూ డీసీసీబీని సందర్శించడం ఆనందంగా ఉందని, డీసీసీబీతో పాటు సొసైటీలు అభివృద్ధి చెందడం ఎంతో సంతోషకరమన్నారు. రాబోయే రోజుల్లోనూ నాబార్డు సహకారం మరింత ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, సీఈవో శంకర్‌రావు, నాబార్డు డీడీఎంలు, బ్యాంకు డీజీఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌పవర్‌తో ఈవీ వాహనాలకు మేలు

● తెలంగాణ నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్



ఎఫ్‌పీవోను పరిశీలిస్తున్న నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్

కట్టంగూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్ సిస్టమ్ ద్వారా ఈవీ వాహనాలకు మేలు కలుగుతుందని తెలంగాణ నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్ అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని అయిటిపాములలో కట్టంగూరు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ తరఫున నిర్వహిస్తున్న ఈవీ చార్జింగ్ స్టేషన్ ఆఫ్ గ్రిడ్ సోలార్ సిస్టమ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీవోలో జరుగుతున్న అన్ని రకాల పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్‌పీవోలు రైతులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కృషి వికాస్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిరుద్యోగ యువతకు మేలు చేస్తుందన్నారు. సోలార్ పవర్ సిస్టమ్ ద్వారా ఈవీ వాహనాలకు పెద్ద ఎత్తున మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు నల్లగొండ డీడీఎం వినయ్‌కుమార్, సూర్యాపేట డీడీఎం రవీందర్‌నాయక్, కట్టంగూరు ఎఫ్‌పీవో చైర్మన్ చెవుగోని సైదమ్మ, అడ్వైజర్ నంద్యాల నర్సింహారెడ్డి, ఐఆర్‌డీఎస్ అధ్యక్షుడు రమేష్, సుధాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఏఓయూతో ఉన్నత విద్య అవకాశాలు

● యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ధర్మానాయక్



కోదాడలో మాట్లాడుతున్న డాక్టర్ బి. ధర్మానాయక్

హుజూర్‌నగర్, కోదాడటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఎంతోమందికి ఉన్నతవిద్య అవకాశాలు లభిస్తున్నాయని యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ బి.ధర్మానాయక్ అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, కోదాడ పట్టణాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు యూనివర్సిటీ వీసీ గంటా చక్రపాణి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కోదాడ కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుబంధంగా ఉన్న స్టడీ సెంటర్‌కు రీజినల్ స్టడీ సెంటర్‌ను మంజూరు చేసినందుకు కృషిచేస్తానని అన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పెంచినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కేఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హదసరాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కంభంపాటి యాదగిరి, జర్నలిజం ప్రొఫెసర్ గిరిగౌడ్, వైస్ ప్రిన్సిపాల్ చందా అప్పారావు, కోఆర్డినేటర్ సైదులు, సైదిరెడ్డి, బాలరాజు, సైదా పాల్గొన్నారు.

రాచకొండ ఎత్తిపోతల పథకమే శరణ్యం

రైతు సంఘం పూర్వ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి



సంస్థాన్ నారాయణపురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి సాగునీటి వనరులు లేని ఈ ప్రాంతానికి సాగునీటి సౌకర్యం కల్పించేందుకు రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని రైతు సంఘం జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, విశ్రాంత ఇంజనీర్ల ఫోరం నాయకుడు ఇంద్రసేనారెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.జహంగీర్ కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రాచకొండ ఎత్తిపోతల పథకంపై సదస్సు నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సులో మల్లారెడ్డి మాట్లాడుతూ ఎలాంటి సాగునీటి సౌకర్యం లేక సకాలంలో వర్షాలు లేక ఈ ప్రాంతమంతా కరువు కోరల్లో చిక్కుకుందని తెలిపారు. ఒక సంవత్సరం వర్షం పడితే నాలుగు సంవత్సరాలు కరువు బారిన పడి రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. డిండి ఎత్తిపోతల పథకం పేరుతో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా శివన్నగూడెం చెరువులను నింపి అక్కడి నుంచి లిఫ్టులద్వారా మండలానికి సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేయ తలపెట్టిన రాచకొండ ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ప్రభుత్వం ఆమోదించలేదని అన్నారు. ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. శివన్న గూడెం రిజర్వాయర్ పూర్తికానిదే నారాయణపురం మండలంలోని గిరిజన తండాలకు ఇతర గ్రామాలకు నీళ్ల వచ్చే పరిస్థితి లేదని, మిట్ట ప్రాంతంలో ఉన్న ఈ ప్రాంతాలకు లిఫ్ట్ ద్వారానే సాగునీరు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చదువుకున్న నిరుద్యోగులు సైతం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాచకొండలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసినట్లయితే ఈ ప్రాంతంలో సాగు తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. రైతులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వలసలు ఆగాలంటే సాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజ్, సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, గుంటోజు శ్రీనివాస్‌చారి, దోడ యాదిరెడ్డి, దోనూరు నర్సిరెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, దొంతగాని పెద్దులు, మల్లెపల్లి లలిత, చింతకాయల నరసింహ, పిట్టరాములు, ఐతరాజు గాలయ్య పాల్గొన్నారు

సాగర్‌లో కృష్ణమ్మ పరవళ్లు

● 26 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల
● మూసీకి తగ్గిన వరద ఉధృతి



నాగార్జునసాగర్ నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్, కేతేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. సాగర్‌కు ఎగువ నుంచి 4,31,678 క్యూసెక్కుల నీరువచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, శుక్రవారం 583.50 అడుగులుగా(293.1090టీఎంసీ లు) నమోదైంది. సాగర్ నుంచి మొత్తం 4,04,993 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తుండగా, ఎగువనుంచి 4,31,678 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

మూసీకి తగ్గిన వరద ఉధృతి

ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గిపోవడంతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ రిజర్వాయర్‌కు వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 14 రోజులుగా మూసీ ఉధృతంగా ప్రవహించి భారీగా వరద చేరడంతో 13 రోజులపాటు ప్రాజెక్టు క్రస్టుగేట్లు ఎత్తి వరదను దిగువ మూసీకి వదిలారు. ఎగువనుంచి 3,891.36 క్యూసెక్కుల వరద వస్తుండగా, ఒక గేటు నుంచి 640.79క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 645 అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు శుక్రవారం సాయంత్రానికి 643.25 అడుగులుగా(4టీఎంసీలు) నమోదైంది. ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల ఆయకట్టుకు 526.19 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది.



కేతేపల్లి పరిధిలో నిండుకుండలా మూసీ

జయశంకర్ మూడు తరాల ఉద్యమ వంతెన

● తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య



స్మారకోపన్యాస సమావేశ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య

మిర్యాలగూడ, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ మూడుతరాల తెలంగాణ ఉద్యమానికి వంతెనగా మారి తీరం చేర్చిన వైతాళికుడని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం టీవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రొఫెసర్ జయశంకర్ 14వ స్మారకోపన్యాసం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నాగయ్య మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం దోపిడీ విధానాలు కొనసాగుతాయని విద్యావంతులు మౌనంగా ఉంటే భవిష్యత్తు సమాజాన్ని కాపడలేమని ముందుగానే సమాజాన్ని చైతన్యవంతం చేసిన మేధావి అని అన్నారు. దేశంలోని నేల, నీరు, అడవులు కార్మిక మానవశక్తులను పాలకులు స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు ధారపోస్తున్నారని ఆరోపించారు. విధ్వంసక పాలనా విధానాలపై జయశంకర్ చూపిన బాటలో నడుస్తూ చారిత్రక ప్రాధాన్యత, వర్తమాన పోరాట పటిమ కలిగిన సంస్థగా టీవీవీ పనిచేస్తుందని అన్నారు. హైద్రాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేట్, ఈసీ ఆడిటోరియంలో ఆగస్టు 24వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు జయశంకర్ స్మారకోపన్యాస సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి టీవీవీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీవీవీ రాష్ట్ర నాయకులు బెల్లకొండ హరికృష్ణ, నారాయణరెడ్డి, డేగవీటి, రాముడుశర్మ, సింధు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవాలిలా!

వినాయక చవితిని పురస్కరించుకొని ఈ నెల 27వ తేదీ నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవకమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు సూచిస్తున్నారు. గణేష్ మండపాలకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను జారీ చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతుంది. ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతిష్ఠించే విగ్రహాలఎత్తు, మండపం ప్రదేశం, నిమజ్జనం తేదీ, నిమజ్జనం ప్రదేశం తదిత ర వివరాలతో కూడిన సమాచారాన్ని దరఖాస్తులో సమర్పించాల్సి ఉంటుంది. అన్ని వివరాలు సక్రమంగా ఉంటే అనుమతి తో పాటు క్యూఆర్ కోడ్‌ను అధికారులు జారీ చేస్తారు.

- (ఆంధ్రజ్యోతి, చండూరు)

దరఖాస్తు చేసుకోవడం ఎలా?

మండపం ఏర్పాటు కోసం పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. https://policeportal.ts police.gov.in వెబ్‌సైట్‌లో అనుమతి కోసం వివరాలను నమోదు చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ ఆధారంగానే అనుమతులు జారీ అవుతాయి. మండపాల్లో



పోలీసుల అనుమతి పత్రం, క్యూఆర్ కోడ్, పోలీసు సూచనలను విధిగా ప్రదర్శించాలి.

ఘర్షణలకు తావివ్వొద్దు

గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి. ఎత్తయిన గణేష్ విగ్రహాలు పెట్టేవారు విద్యుత్ వైర్లు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. యువత స్నేహపూర్వకంగా మెలగాలి. ఘర్షణలకు తావివ్వకుండా పోలీసుల సూచనలు పాటించాలి. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవు.

- ఎన్ వెంకన్న, ఎస్ఐ, చండూరు

- విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం
- రూ.500 డీడీ చెల్లిస్తేనే విద్యుత్ కనెక్షన్

పోలీసుల సూచనలు పాటించాలి

- గణేష్ మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వాహకులదే.
- ప్రతీ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలి.
- గణేష్ మండపాలు ప్రజా రవాణా, ఎమర్జెన్సీ వాహనాలు,ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలి.
- మండపం స్థలంకోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తీసుకోవాలి.
- రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ స్పీకర్లు వినియోగించాలి.
- డీజేలకు అనుమతి లేదు.
- గణేష్ మండపాల వద్ద మద్యం తాగడం, పేకాట ఆడటం, అసభ్యకరమైన నృత్యాలు చేయడం, అన్యమతస్తులను కించపరిచేలా ప్రసంగించడం, పాటలు పాడటం పూర్తిగా నిషేధం.
- ఎవరికైనా ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత పోలీస్ వారికి లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.

విద్యుత్ అధికారుల సూచనలు

- గణేష్ మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎత్తయిన విగ్రహాలు తీసుకు వచ్చేటప్పుడు విద్యుత్ లైన్లు అడ్డం వస్తే అధికారులకు తెలియజేసి విద్యుత్ సరఫరాను నిలిపివేసిన అనంతరం తీసుకెళ్లాలి.
- మండపాల వద్ద విద్యుత్ సరఫరాకు రూ.500 డీడీని విద్యుత్‌శాఖకు చెల్లిస్తే అనుమతి ఇస్తారు.
- వర్షాకాలం కాబట్టి మండపాల వద్ద ఇనుప పైపులతో మండపం నిర్మించుకుంటే, విద్యుత్ వైర్‌ను పైపులకు చుట్టవద్దు.
- మండపానికి విద్యుత్ సరఫరా చేసే వైర్ నాణ్యమైనది మాత్రమే వాడాలి. అతుకుల వైర్‌ను వాడవద్దు. గణేష్ మండపాలకు, విగ్రహాలకు చిన్న చిన్న లైట్లు వాడకూడదు. విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది.
- మైక్‌సెట్‌లు, సౌండ్ బాక్స్‌లు పెట్టే దగ్గర అనుభవజ్ఞులైన మెకానిక్‌లతోనే ఏర్పాటు చేపించాలి.
- కమిటీ సభ్యులకు ఏమైనా విద్యుత్ ప్రమాదం జరిగినా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉన్నా టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలి.

జిల్లా స్థాయి యోగా పోటీలు రేపు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న తేదీన నల్లగొండ పట్టణంలోని సీపీఎం భవన్‌లో జిల్లాస్థాయి యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీల వారీగా ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు ఉదయం 9గంటలలోపు బోనఫైడ్, ఆధార్ కార్డు పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9885140616 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా బద్రునాయక్



నల్లగొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ ఇరిగేషన్ సర్కిల్ నూతన ఎస్ఈగా ధారావత్ బద్రునాయక్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బద్రునాయక్ గతంలో ఉమ్మడి నల్లగొం డ జిల్లాలో వివిధ హోదాలో పలు ప్రాంతాల్లో పనిచేసి మంచిగుర్తింపు పొందారు. ఈసందర్భంగా బద్రునాయక్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కార్యాలయంలోని అసిస్టెంట్ ఇంజనీర్ రాజారత్నం, టెక్నికల్ సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది ఎస్ఈని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఆలేరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు. 100రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 8,9,10 వార్డుల్లో డ్రై డే ఫ్రై డే కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులు దూరంగా ఉంటాయని అన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చెత్తాచెదారం తొలగించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస చివరి పూజలు

భువనగిరి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరిరోజు శుక్రవారం భువనగిరిలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారిని 101 చీరలతో అలంకరించారు. అలాగే సంతోషిమాత, భువనేశ్వరి మాత, రాజరాజేశ్వరి మాత, నల్ల పోచమ్మ తదితర ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ

మోటకొండూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాడ జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సూదగాని ఫౌండేషన్ అధ్వర్యంలో గుర్తింపు కార్డులను సుదగాని ఫౌడేషన్ అధినేత జయసుధ హరి శంకర్‌గౌడ్ అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యయుడు మోర బాలగంగాధర్‌రెడ్డి, యాదిరెడ్డి, పబ్బతి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కోశాధికారికి సన్మానం

మోత్కూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కోశాధికారిగా రెండోసారి నియమితుడైన మోత్కూరుకు చెందిన గుజ్జ సోమనర్సయ్యను శుక్రవారం బీజేపీ మోత్కూరు పట్టణ శాఖ అధ్వర్యంలో ఘనంగా సన్మానించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తనను సన్మానించిన నాయకులకు సోమనర్సయ్య కృతజ్ఞతలు తెలిపి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల, నాయకులు గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, సజ్జనం మనోహర్, జినుకల దశరథ, అన్నెపు సత్యనారాయణ, కందుకూరి ప్రకాష్, ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలి

మోత్కూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పనుల జాతరలో మంజూరైన పనులను నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో డి.బాలాజీ, ఏపీవో కరుణాకర్ కోరారు. శుక్రవారం మండలంలోని ముశిపట్ల గ్రామంలో పనులు మంజూరైన లబ్ధిదారులకు వారు ప్రొసీడింగ్స్ అందజేసి, కొన్ని పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. మోత్కూరు మండలంలో ఉపాధి హామీ పథకంలో రూ.45.95 లక్షల వ్యయంతో 177 పనులు మంజూరు అయ్యాయన్నారు. పశువుల పాకకు రూ.95 వేలు, మేకలు/గొర్రెల పాకకు రూ.71 వేలు, అజోళ పెంపకానికి రూ.15వేలు, చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.5లక్షలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2లక్షలు, నాడపు కంపోస్టు షెడ్‌కు రూ.18వేలు, పౌల్ట్రీ షెడ్‌కు రూ.73వేలు, సోక్‌పిట్‌కు రూ.6,500 చొప్పున మంజూరయ్యాయన్నారు. ముశిపట్లలో పారిశుధ్య విధులు బాగా నిర్వహించిన మల్టీపర్పస్ వర్కర్‌ను, మొక్కల పెంపకంలో శ్రద్ధచూపిన వ్యక్తిని, ఉపాధి హామీలో అత్యధిక పనిదినాలు పని చేసిన దివ్యాంగ కూలీని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సన్మానించారు. దత్తప్పగూడెంలో ఎంపీవో పైళ్ల జనార్ధన్‌రెడ్డి పశువుపాక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకవరం లక్ష్మణాచారి, టీఏ జాఫర్, ఎఫ్ఏ సోమిరెడ్డి. సులోచన, జయమ్మ, పాపిరెడ్డి, శివరాజు పాల్గొన్నారు.


వలిగొండ: పనులన జాతరను ప్రారంభిస్తున్న అధికారులు

గుండాల: మండలంలోని అనంతారం, సీతారాంపురం గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ పనుల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధి హామీ వర్కర్ జోగు అయిలయ్య , గ్రామ పంచాయతీ ఉత్తమ వర్కర్ నర్సింహను ఎంపీడీవో దేవేందర్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి, కారోబార్ వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్లు జి.వాణి, ఆశావర్కర్లు కవిత, లావణ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలంలో ఉపాధి హామీ పనుల జాతరను ఎంపీడీవో రాములు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడివో రాములు, ఎంపివో పద్మావతీ, ఏపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలో 37 గ్రామపంచాయితీలలో ఆయా గ్రామసభల్లో చర్చించి రూ.1,40కోట్ల వ్యయంతో పనుల జాతరను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, తహసిల్దార్ దశరథ, ఎంపీవో కేదారీశ్వర్, ఏపీవో పరుశరాములు పాల్గొన్నారు.

రామన్నపేట: గత ఏడాది చేపట్టిన జీపీ, అంగన్వాడీ భవనాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, ఉద్యానవనాలు, సోక్‌పిట్స్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సిగ్రిగేషన్ షెడ్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీవో రాములుయాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధలో చేపట్టారు.


ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

విధిగా బోధనాభ్యసన సామగ్రిని ప్రదర్శించాలి

తుర్కపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు రూపొందించిన బోదనాభ్యసన సామగ్రి కృత్యాలను టీఎల్‌ఎం మేళాలో ప్రదర్శించాలని ఎంఈవో వి. మాలతి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 23వ తేదీన గురువారం నిర్వహించే టీఎల్‌ఎం మేళాల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని 37ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హాజరవుతున్నారని తెలిపారు. పాఠశాలలో కృత్యాలను ప్రదర్శించేందుకు 5తరగతి గదులను కేటాయించామని తెలిపారు. ప్రధానోప్యాయులు రాపెల్లి శ్రీనివాస్, స్వరూపరాణి, ఉపాధ్యాయులు బిక్షమయ్య, సుజీవన్‌రావు, ఆర్.శ్రీనివాసరావు, పి.అశోక్‌కుమార్, విశ్వేశ్వరరావు, నరేందర్‌రెడ్డి, పి.శ్రీశైలం, ఎం.సుజాత, ఎస్ మాధవి, కరుణాకర్‌రెడ్డి సీఆర్పీ చందర్, ఎఆర్పీ సిబ్బంది శ్రీనివాస్, నవిత, జహంగీర్ ఉన్నారు.


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మాలతి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కేంద్రం


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక భువనగిరి ఖిల్లా అభివృద్ధికి ఇచ్చిన మాటను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకున్నదని బీజేపీ నాయకులు అన్నారు. స్వదేశీ దర్శన్ 2.0 పథకంతో ప్రారంభమైన ఖిల్లా రోప్‌వే తదితర అభివృద్ధి పనులను శుక్రవారం బీజేపీ నాయకులు పరిశీలించి ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రత్నపురం బలరాం, పట్నం శ్రీనివాస్, జెన్నపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్తా, సీహెచ్ వెంకటేశ్వరరావు, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, మేడి కోటేష్, రామకృష్ణ, మంగు నరసింహారావు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

ఆలేరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని యాదగిరిగుట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన గణేష్ ఉత్సవ కమిటీ, శాంతి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గణేష్ మండపాల వద్ద డీజేలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ప్రతీ మండపం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భజన కోసం రెండు చిన్న సౌండ్ బాక్స్‌లను ఇతరులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. తహసీల్దార్ ఆంజనేయులు ఎంపీడీవో సత్యనేంజనేయ ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, సీఐ యాలాద్రి పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: పట్టణంలో ఉత్సవాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో శాంతియుతంగా భువనగిరి టౌన్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ మాట్లాడారు.

బీబీనగర్: బీబీనగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గణేశ్ మండపాల నిర్వహకులు, యువజన సంఘాలతో సీఐ ప్రభాకర్‌రెడ్డి శాంతి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎస్ఐ రమేశ్ , ఎస్ఐ అమర్‌సింగ్ పాల్గొన్నారు.

తుర్కపల్లి/రాజాపేట: మండల కేంద్రాల్లో నిర్వహించిన శాంతి కమిటీ, గణేశ్ మండపాల నిర్వాహకుల సన్నాహక సమావేశాల్లో యాదగిరిగుట్ట సీఐ శంకర్‌గౌడ్ మాట్లాడారు.


ఆలేరు రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు

ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శాగ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో శుక్రవారం శాగ చంద్రశేఖర్‌రెడ్డి తో పాటు పార్టీ రూరల్ ఇన్‌చార్జ్ శివకృష్ణను మండల కమిటీ అధ్యక్షుడు కైరంకొండ అశోక్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో ఒక్క గ్యారంటీ కూడా పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేకపోయిందని, సమీక్షలతోనే కాలం వెళ్లబుచ్చుతోందని ఆయన అన్నారు. మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచించిందని ఆయన విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అందజేస్తున్న నిధులతోనే గ్రామ పాలన సాగుతోందని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని, మద్దతు కూడగట్టాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, నాయకులు జంగయ్య, కట్ట కృష్ణ, బి.వెంకటేశం, వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.


బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు అశోక్

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

అడ్డగూడూరు/ వలిగొండ/ చౌటుప్పల్ రూరల్/ భువనగిరి రూరల్/ మోత్కూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టుచేసి, అనంతరం వ్యక్తిగత పూచీపై విడుదల చేవారు. అడ్డగూడూరులో బీజేపీ మండల అధ్యక్షుడు ననుబోతు సైదులు, కూరాకుల వెంకటేశ్వర్లు, దేశబోయిన నాగరాజు, కొత్తజ్ నవీన్‌కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు. వలిగొండలో బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, నాయకులు బంధారపు లింగస్వామి, మండల ఉపాధ్యక్షుడు మందుల నాగరాజు, కీర్తి వెంకటేశం ఉన్నారు. చౌటుప్పల్‌లో బీజేపీ నాయకులు దూడల భిక్షం గౌడ్, ముత్యాల భూపాల్ రెడ్డి, కడారి కల్పన యాదవ్, భాస్కర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, పబ్బు వంశీ, కట్ట కృష్ణ, వరగంటి భాను ఉన్నారు. మోత్కూరులో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల, నాయకులు గౌరు శ్రీనివాస్, ఎడ్ల రాము, దీటి సందీప్, మరాఠి అంజయ్య ఉన్నారు.


వలిగొండలో పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

ఆత్మకూరు(ఎం) ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అసంపూర్తిగా ఆగిపోయిన బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేయాలని, మండల కేంద్రంలో అసంపూర్తిగా ఆగిపోయిన బీటీ రోడ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశాడు. అనంతరం ఆర్‌ఐ వెంకటేశ్వర్లు కు మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జి.కాశీనాథ్ , మండల ప్రధాన కార్యదర్శి రాగటి మచ్చగిరి, నాయకులు బొట్టు అబ్బయ్య, బొబ్బల ఇంద్రారెడ్డి, డి.కుమారస్వామి పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ అధ్యక్షురాలిగా శ్రీలత

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని రాణి రుద్రమదేవి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలిగా పోలోజు శ్రీలత ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా చొల్లేటి పద్మ, కె. అరుణ, పి.రమణ, బి. రజని, దేవి, ప్రశాంతి, మేఘన, ప్రభ, సరిత లు ఎన్నికయ్యారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : సీపీఎం

భువనగిరి గంజ్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లు గుంతగుంతలుగా ఏర్పడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని శుక్రవారం సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు బందెల ఎల్లయ్య, వనం రాజు, వల్దాస్ అంజయ్య, మద్దె బోయిన సుందరయ్య, బాబురావు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో వీధులు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వీధుల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో వీధులన్నీ అంధకారంలో ఉన్నాయి. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని 5వ వార్డు పరిధిలోని మహమ్మాయి కాలనీలో వీధి లైట్లు పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం కాలనీ వాసులు మునిసిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అంజేశారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): 20 సంవత్సరాల నుంచి తక్కువ వేతనంతో ఎక్కువ సేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్యం కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఆశా వర్కర్ల మండల స్థాయి ముఖ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాల సమస్యలపై ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న దర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక మెడికల్ ఆఫీసర్ పావనికి అందజేశారు

వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలి

వలిగొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మైసోళ్ల నరేందర్, నాయకులు సాయివినయ్, ఫాతిమా, భవాని, చందు పాల్గొన్నారు

జిల్లా వైద్య కళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీ

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న 56 పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయిమెంట్ అసిస్టెంట్ మిషన్ (టీమ్) కార్యదర్శి శాంతిశ్రీ ఖాళీ పోస్టుల వివరాలు వివరించారు. మెరిట్, రోస్టర్ అర్హతల నుబట్టి భర్తీ చేయనున్నట్లు వివరించారు.

పోస్టు పేరు	సంఖ్య
ఈసీజీ టెక్నీషియన్	4
ల్యాబ్ అటెండెంట్	7
రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్	4
ఓటీ టెక్నీషియన్	4
అనస్తీషియా టెక్నీషియన్	2
గ్యాస్ ఆపరేటర్	4
థియేటర్ అసిస్టెంట్	2
డేటాఎంట్రీ ఆపరేటర్	7
ఆఫీస్ సబార్డినేట్	6
సీటీ టెక్నీషియన్	4
ఎలక్ట్రీషియన్	3
ప్లంబర్	2
బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్	3
రికార్డ్ అసిస్టెంట్	1
కార్పెంటర్	1

డీడీలు తీసి 10రోజులైనా అందని యూరియా

మోత్కూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు సింగిల్ విండోకు 80టన్నుల యూరియా కావాలని డీడీలు (డబ్బులు చెల్లించి)తీసి 10రోజులు అవుతున్నా తమ సంఘానికి యూరియా రాలేదని ఆ సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల వర్షాలు కురియడంతో పత్తి, వరి చేలకు రైతులు యూరియా వేస్తున్నారన్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై వివక్ష చూపుతూ యూరియా అందించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్న వివక్షతో కేంద్ర ప్రభుత్వం యూరియా అందించకుండా రైతులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా తమ సింగిల్ విండోకు యూరియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

యూరియా సరఫరాలో కేంద్రప్రభుత్వం వివక్ష

మోత్కూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి అవసరమైనంత యూరియా సరఫరా చేయకుండా కేంద్రప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్ష చూపుతోందని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్, జూలై మాసాల్లో వర్షాలు లేక రాష్ట్రంలో పంటల సాగు తక్కువగానే ఉందన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం తగినంత యూరియా సరఫరా చేయకపోవడంతో రైతులు వ్యవసాయ క్షేత్రాల వద్ద పనులు చేసుకోకుండా దుకాణాల చుట్టూ తిరుగుతూ, లైన్లలో నిల్చొని నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రాష్ట్రానికి అవసరమైన యూరియా పంపాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు దడిపల్లి ప్రభాకర్, కుర్మేటి యాదయ్య, పిట్టల చంద్రయ్య, సైదులు ఆయన వెంట ఉన్నారు.

నానో యూరియాతో ప్రయోజనాలు

భువనగిరి రూరల్/ ఆలేరు/యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులకు దీటుగా నానో యూరియాతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి డి.మల్లేశ్ అన్నారు. శుక్రవారం భువనగిరి మండలంలోని రెడ్డినాయక్ తండాలో రైతు గుగులోతు ఈరాలాల్ వ్యవసాయ క్షేత్రంలో నానో యూరియా నానో డీఏపీ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో ప్రియాంక, రైతులు గుగులోతు లాల్, రాజు పాల్గొన్నారు. ఆలేరు మండలంలోని మందనపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ షాకేరా, రైతులు మహేష్, సురేష్, రఘునందన్, రమేష్, శ్రీహరి, కిష్టయ్య, రామనర్సయ్య, శేఖర్, ఉదయ్ భాస్కర్, విజయలక్ష్మి, మాధవి నాగమణి, ప్రమీల పాల్గొన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని పలు గ్రామాల్లో నానో యూరియా నానో యూరియాపై రైతులకు అవగహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఏవో సుధారాణి, ఏఈవోలు విరణ్, ప్రణయ్, శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


భువనగిరి రూరల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శతశాతం అక్షరాస్యత లక్ష్యం

(5వపేజీ తరువాయి)

ఉంటుంది. పదో తరగతి, సైన్స్ నాన్ సైన్స్ గ్రూపులుగా ఉండే ఇంటర్మీడియట్ ఒకే సంవత్సరంలో పూర్తవుతాయి. 14 ఏళ్లు నిండిన వారు పదో తరగతికి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్‌కు అర్హులు. అయితే రెగ్యులర్ ఇంటర్‌లో ఫెయిల్ అయిన అభ్యర్థులు ఓపెన్ స్కూల్ ఇంటర్‌లో ఆ సబ్జెక్టులను మాత్రమే చదివి పాసయ్యే సౌలభ్యం ఉంది. లేదా నచ్చిన ఐదు సబ్జెక్టులతో కోర్సును పూర్తి చేయవచ్చు. ఆసక్తి ఉన్న ఇతరులు కూడా నేరుగా లేదా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ పొందవచ్చు. పదో తరగతికి రూ.1150, ఇంటర్‌కు రూ.1500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లాలో ఇప్పటివరకు సుమారు 400 మందిని ఓపెన్ స్కూల్‌కు అర్హులుగా గుర్తించి పేర్లు నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో..: ఉమ్మడి జిల్లాలో సుమారు 58,169 మహిళా సమభావన సంఘాలు ఉండగా, 5,13,422 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరిలో మొదటి దశ ఎన్ఐఎల్‌పీకి 1,29,874 మందిని గుర్తించగా ఉల్లాస్ యాప్‌లో నేటి వరకు 1,14,682 మందిని నమోదు చేశారు. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు లక్ష్యం జిల్లాలో 1,281 మందికి 442 మంది, సూర్యాపేట జిల్లాలో 4,400కి 380 మంది, నల్లగొండ జిల్లాలో 6,451 మందికి 380మంది పేరు నమోదు చేసుకున్నారు. కాగా, 2011 జనాభా లెక్కల ప్రకారం యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో 75శాతం చొప్పున, నల్లగొండ జిల్లాలో 63.85 శాతం అక్షరాస్యత ఉంది.

మహిళలందరినీ అక్షరాస్యులు చేస్తాం

ఎన్ఐఎల్‌పీలో నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులు చేస్తాం. మొదటి దశలో సమభావన సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశాం. వాలంటీర్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఓపెన్ స్కూల్‌లో చేరు మహిళల ఫీజులను సమభావన సంఘాల లాభాల నుంచి చెల్లించాలని సూచించాం. ఎన్ఐఎల్‌పీ మిగతా నాలుగు దశల్లో అన్ని రంగాల స్త్రీ, పురుషులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతాం. వయోభేదం లేకుండా అందరూ భాగస్వాములు కావాలి. అక్షరాస్యులు వాలంటీర్లుగా స్వచ్ఛందంగా సేవలు అందించాలి. -నాగిరెడ్డి, డీఆర్‌డీవో

సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తాం

జిల్లాలో శతశాతం అక్షరాస్యత సాధిస్తాం. అదే ఎన్ఐఎల్‌పీ ఉద్దేశం. వయోభేదం లేకుండా అందరూ భాగస్వాములు కావాలి. మొత్తం ఐదు దశల్లో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. వలంటీర్లను నియమిస్తున్నాం. -వి.నరసింహారెడ్డి, వయోజనవిద్య ఏపీవో

ఓపెన్ స్కూల్స్ గుర్తించాం

జిల్లాలో ఓపెన్ స్కూల్ సెంటర్స్‌ను గుర్తించాం. 18 కేంద్రాలకు 13 కేంద్రాల గుర్తింపు పూర్తయింది. త్వరలో మిగతా ఐదు కేంద్రాలను గుర్తిస్తాం. ఓపెన్ స్కూల్ టీచర్స్‌కు శిక్షణ ఇచ్చాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ప్రారంభిస్తాం. ఆసక్తిగల అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. -కె.సత్యనారాయణ, డీఈవో

చిరంజీవి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు


ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న జహంగీర్ తదితరులు

భువనగిరి గంజ్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శంగా నిలుస్తున్న మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సినీ హీరో, పద్మ విభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా భువనగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్యాస్ చిన్న, సోమ రవీందర్‌రెడ్డి, యనగండ్ల సుధాకర్, కర్తల జగన్, శ్రీనివాస్, మద్రె నరేష్, నిషాంగి కళ్యాణ్ చక్రవర్తి, దర్గాయి దేవేందర్, రాము, పాల్గొన్నారు.

స్థానికుల జీవనోపాధిని పరిరక్షించాలి

భువనగిరి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానికుల జీవనోపాధిని పరరిక్షించాలని, మార్వాడీ వ్యాపారులు గోబ్యాక్ అంటూ స్థానిక వ్యాపారులు డిమాండ్‌చేశారు. శుక్రవారం భువనగిరిలో స్థానిక వ్యాపారులు నిరసన తెలిపారు. పలువురు తమ దుకాణాలు బందు చేసి ర్యాలీ నిర్వహించారు. మార్వాడీలు కల్తీ వస్తువులను విక్రయిస్తూ తెలుగు ప్రజల పట్ల దోపిడీకి పాల్పడుతున్నారని ఆందోళనకారులు ఆరోపించారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం సభ్యులు దేవేంద్రచారి. గిరిధరచారి, శ్రీకాంత్, రాజేష్, నరేష్ పాల్గొన్నారు. అయితే శుక్రవారం తెల్లవారుజామున మార్వాడీ జేఏసీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వ్యక్తిగత పూచీపై వదిలిపెట్టారు.

మోత్కూరు : పట్టణంలో స్థానిక వ్యాపారులు శుక్రవారం దుకాణాలు మూసి వేసి 'మన ఊరు-మన దుకాణం' నినాదంతో మార్వాడి వ్యాపారులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి అంబేడ్కర్ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహిస్తుండగా కొంత దూరం వెళ్లగానే పోలీసులు వచ్చి ర్యాలీకి అనుమతి లేదంటూ వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ర్యాలీలో పాల్గొన్న వారిని కొంతసేపు పోలీస్ స్టేషన్లో ఉంచి వదిలేశారు. మొబైల్, క్లాత్, గోల్డ్, ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

రామన్నపేట: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వర్తక వ్యాపారుల సంఘం మండల అధ్యక్షుడు కన్నెకంటి వెంకటేశ్వర్‌చారి, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి ఎంఏ వహీదు, ఉపాధ్యక్షుడు వనం భిక్షపతి, చొల్లేటి పాండురంగాచారి, తమ్మిశెట్టి సందీప్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు ఎస్‌హెచ్ఓ హనుమంతు వ్యాపారస్తులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. సొంతపూచీకత్తుపై వదిలేశారు. కార్యక్రమంలో వ్యాపారులు పాల్గొన్నారు.



రామన్నపేటలో ఆందోళన నిర్వహిస్తున్న స్థానిక వ్యాపారులు

చౌటుప్పల్ టౌన్ : మార్వాడీలు గో బ్యాక్ అంటూ చౌటుప్పల్ పట్టణంలో శుక్రవారం వ్యాపారులు దుకాణాలను మూసివేసి బంద్ పాటించారు. జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాపార సంస్థల ప్రతినిధులు కర్నాటి శాం ప్రసాద్, తడక నర్సింహ్మ, కే.కిషోర్‌కుమార్, కే.సంతోష్, సంపూర్ణ చారి, బిక్షమాచారి, వెంకటాచారి, గోశిక స్వామి, పున్న సత్యనారాయణ, సుంకి గణేష్, జిల్లా చంద్రయ్య పాల్గొన్నారు.